క్లుప్తంగా

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి..


మాట్లాడుతున్న సాయి

ఇల్లెందు: నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం ఇల్లెందులో ఏఐఎస్ఎఫ్ పట్టణ కమిటీ సమావేశంలో కార్యదర్శి సాయి మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. ఇల్లెందులోనూ పలు ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవటం వల్ల కళాశాలల నుంచి విద్యార్థులపై ఒత్తిడి తీవ్రమైందన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వటం లేదన్నారు. ఉన్నత చదువులకు వెళ్లకుండా మధ్యలో ఆగిపోయే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.

పశువైద్యాధికారిగా కాత్యాయని



సుజాతనగర్: మండల పశువైద్యాధికారిగా సింగిరాల కాత్యాయని రానున్నారు. కొత్తగూడేనికి చెందిన కాత్యాయని టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్ష రాసి ఉత్తీర్ణులయ్యారు. ఈ మేరకు సుజాతనగర్‌లో వైద్యుని పోస్టు ఖాళీగా ఉండటంతో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా ఆమెకు ఇక్కడ తొలి పోస్టింగ్ లభించింది.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఇల్లెందు: ప్రపంచంలో బీజేపీ అధికంగా సభ్యత్వం కలిగిన పార్టీగా నిలిచిందని, తన చరిత్రను తానే తిరగరాస్తోందని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని కళాసీ బస్తీలో ఇంటింటి బీజేపీ సభ్యత్వాన్ని ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పరిస్థితి దిగజారుతోందన్నారు. మభ్యపెట్టి వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయలేక అతలాకుతలం అవుతోందన్నారు. మహిళలకు ఉచిత బస్ సదుపాయం తప్ప ఏ ఒక్క హామీ అమలు నోచుకోవడం లేదన్నారు. దేశంలో మోదీ నాయకత్వంలో భారత్ అగ్రగామిగా నిలిచిందన్నారు. యువతకు మహిళలకు పెద్ద పీట వేస్తోందని చెప్పారు. నాళ్ల సోమసుందర్, బలగాని గోపీకృష్ణ, మురళీకృష్ణ, రజత్ కోరి, సంతు, శివం హంటర్ సతీష్ పాల్గొన్నారు.

జీఓ 76 అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మున్సిపాలిటీ పరిధిలో జీఓ 76 పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్ శుక్రవారం తహసీల్దార్ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... ఈ పథకాన్ని 2023లో ఇళ్లు నిర్మించుకున్న వారికి కూడా వర్తింపజేయాలని కోరారు. పట్టాలు ఇచ్చిన వారికి హద్దుల సవరణ చేసుకునే విధంగా జీఓలో మార్పులు చేయాలన్నారు. ఉమ్మడి ఆస్తిని ఒకే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడం వలన కుటుంబంలో అసౌకర్యం, కలహాలు కలుగుతున్నాయని, విచారణ తరువాతే రిజిస్ట్రేషన్లు చేయాలని కోరారు.

జీఓ 29 రద్దు చేయండి..


నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: జీఓ నంబర్ 29 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సేవాలాల్ సేన అధ్వర్యంలో జిల్లా గ్రంథాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ మాట్లాడుతూ... జీఓ నంబర్ 29 వలన గ్రూప్ – 1 ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు న్యాయం జరుగుతుందని వెంటనే ఆ జీఓను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడ్యా వెంకటేష్, అధికార ప్రతినిధి బానోతు నాగరాజు, జూలూరుపాడు మండల అధ్యక్షుడు బానోతు లక్ష్మణ్‌నాయక్, పవన్, రమేష్ నాయక్, దేవేందర్, సురేష్, బాలు నాయక్ పాల్గొన్నారు.

పోలీసులపై నమ్మకం ఉండాలి..

- సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు..
- టేకులపల్లి పోలీసు స్టేషన్ తనిఖీ
- మొక్కలునాటి, సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎస్పీ


టేకులపల్లి పోలీసుస్టేషన్‌లో గాడ్ ఆఫ్ హానర్ స్వీకరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

టేకులపల్లి: వృత్తిపరంగా తలెత్తే సమ్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. శుక్రవారం టేకులపల్లి పోలీసు స్టేషన్‌ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా స్టేషన్‌కి భయపడుతూ రావొద్దని, నిర్భయంగా వచ్చి తమ సమస్యలు చెప్పుకునేలా పోలీసులంటే ప్రజలకు నమ్మకం కలిగించాలని తెలిపారు. ఏదైనా సమస్యతో ఫిర్యాదు తీసుకుని స్టేషన్‌కి వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ వారికి సత్వర న్యాయం జరిగేలా విధులు నిర్వహించాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయడం వల్లనే ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని, ప్రతీ గురువారం కేవలం పోలీసు సిబ్బంది కోసమే ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేయడం జరిగిందని ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేస్తూ స్టేషన్‌ని సుందరంగా తీర్చిదిద్దిన సీఐ, ఎస్‌ఐలను అభినందించారు. అనంతరం పోలీసుస్టేషన్ ఎదుట నిర్మించిన రిక్వెస్ట్ బస్‌స్టాప్, టేకులపల్లి, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ సెంటర్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. పోలీసు స్టేషన్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రభాను, టేకులపల్లి సీఐ టి.సురేష్, టేకులపల్లి, బోడు, ఆళ్లపల్లి ఎస్‌ఐలు టి.సురేష్, పి.శ్రీకాంత్, రతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న ఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

మహిళల భద్రత మన బాధ్యత


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

సింగరేణి(కొత్తగూడెం): యువత, మహిళల భద్రత మన బాధ్యతని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియాలోని గౌతంపూర్‌లోని సింగరేణి సేవా సమితి కార్యాలయంలో డ్రగ్స్, మహిళల భద్రత, సైబర్ నేరాలు, 100 వాహనంపై అవగాహన కల్పించారు. మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, వారిని దారిన పెట్టే బాధ్యత మనందరిదన్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా షీ టీమ్, 100కు ఫోన్ చేసి తమ సమస్యను చెప్పుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసమే ప్రభుత్వం షీ టీమ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, తదితర అంశాలపై వివరించారు. గంజాయి ఎక్కడైన ఉన్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎస్‌ఐ సెల్వరాజ్, బ్లాకోర్ట్ రాజా, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, ప్రగతి గ్రామ సమాఖ్య వీఏఓ పద్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ జిల్లా సమావేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జూలూరుపాడు: కొత్తగూడెంలో శనివారం జరగనున్న బీఆర్ఎస్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు హాజరు అవుతుతారని తెలిపారు. మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

తాగునీటి సరఫరా మెరుగ్గా ఉండాలి


మాట్లాడుతున్న డీఈ మురళీకృష్ణ

ఇల్లెందురూరల్: పల్లెల్లో తాగునీటి సరఫరా మెరుగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ మురళీకృష్ణ సూచించారు. మండలంలోని మిషన్ భగీరథ కార్యాలయంలో శుక్రవారం తాగునీటి సరఫరా, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రిడ్ నుంచి వినియోగదారుని ఇంటి వరకు ఉన్న తాగునీటి పైపులైన్ల వ్యవస్థపై అవగాహన ఉండాలన్నారు. క్రమం తప్పకుండా పైపుల మార్గంలో పర్యటించాలని, లీకేజీలు గుర్తిస్తే గ్రామపంచాయతీ అధికారుల సహాయంతో వాటిని అరికట్టాలన్నారు. తాగునీటి పథకాలు క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని, అవసరమైన చోట్ల ట్యాంకుల శుభ్రంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. నీటిసరఫరాలో ఎటువంటి పొరపాట్లు జరిగినా సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో అధికారులు బాలాజీ, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభలను జయప్రదం చేయాలి


కొత్తగూడెంరూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: వరంగల్ ఉస్మానియా యూనివర్సిటీలో 21వ తేదీ నుంచి 25 వరకు జరగనున్న మేఘ గర్జన సభలను విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.సింధు తెలిపారు. పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో సభ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ ఆవిర్భావం నుంచి సమసమాజ స్థాపన లక్ష్యంగా పోరాటాలను నిర్వహిస్తూ, విద్యారంగంలో మౌలిక వసతులకై పోరాటాలు నిర్వహించామన్నారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డి.అరుణ్‌తరుణ్, డి.వినయ్, గౌతమి, దుర్గ తదితరులు ఉన్నారు.

ఇల్లెందు: పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుకలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉస్మానియాలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టేకులపల్లి: పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉస్మానియా యూనివర్సిటీలో మేఘ గర్జన సభ, ఈనెల 25న తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వరంగల్‌లో పోరాట స్ఫూర్తి సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు బి.భారతి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరుణ్, రవితేజ, చరణ్, గౌతమి, శ్రీజ, ప్రియాంక, కావేరి తదితరులు పాల్గొన్నారు.

రైతులతో శాస్త్రవేత్తల సమావేశం

సుజాతనగర్: పత్తి, వరి పంటలో తెగుళ్లు, యాజమాన్య పద్ధతులపై సుజాతనగర్ రైతు వేదికలో శనివారం అవగాహన కార్యక్రమం ఉంటుందని ఏఓ జి.నర్మద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హాజరై రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని, మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి..


పిల్లల ఎత్తు, బరువును పరిశీలిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: పోషకాహార లోపంతో బాధపడే పిల్లలకు బాలమృతం లాంటి పోషకారం అందించాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్యామ్ చిల్డ్రన్స్(పోషకాహార లోపం పిల్లలు) గురించి శ్యామ్ మ్యామ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

ఐదేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు బాలమృతం అందించే విధంగా కృషి చేయాలన్నారు. పోషకాహార లోపంతో బాధపడే పిల్లల్లో పెరుగుదల సరిగా ఉండదని, అదేవిధంగా మానసిక పెరుగుదల మందగించి పలు అనారోగ్య సమస్యలతో సతమతం అవుతారని చెప్పారు. చదువులో ఏకాగ్రత లోపిస్తుందన్నారు. రక్తహీనత కూడా ఉంటుందన్నారు. అనంతరం పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్విని, సీహెచ్ఓ రామకృష్ణ, హెచ్‌ఎస్‌లు రాధిక, ప్రియదర్శిని, శ్రీవిద్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చేపపిల్లలను నిరాకరించిన మత్స్య సొసైటీ


చేపపిల్లలను అందజేస్తున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: మండలంలోని మత్స్య సొసైటీలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ధన్‌సింగ్ శుక్రవారం 4.90 లక్షల చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధి లక్ష్యంగా సొసైటీలకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తోందన్నారు. అంతకు ముందు చేపపిల్లల పంపిణీని సొసైటీ సభ్యులు నిరాకరించారు. గతంలో జూన్, జూలైలోనే చేపపిల్లలు పంపిణీ చేసేవారని, ఈసారి అక్టోబర్‌లో పంపిణీ చేయడం వల్ల ఎటువంటి ఫలితం ఉండదని, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న చేపపిల్లలు మరీ చిన్నవిగా ఉన్నాయని వాపోయారు. ఇటువంటి చేపపిల్లలను ఉచితంగా తీసుకొని ప్రజలలో అభాసుపాలవుతామని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు సొసైటీ అధ్యక్షులతో చర్చలు జరిపి చేపపిల్లలు తీసుకునేలా ఒప్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ ఎండీ ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, సిబ్బంది కోటేశ్వరరావు, అనిల్, ఎంపీఓ చిరంజీవి, సొసైటీ పెద్దలు బుచ్చయ్య, తోడేటి నాగేశ్వరరావు, ముక్తి కృష్ణ, దేవ్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

టేకులపల్లి: టేకులపల్లి, బోడు, బొమ్మనపల్లి, కోయగూడెం సబ్‌స్టేషన్లలో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈలు హెచ్.దేవా, పి.బుజ్జి కన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

21న మహిళా సంఘం మహాసభ

ఇల్లెందు: 21న కొత్తగూడెంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 4వ మహాసభ జరగనుంది. ఈ మేరకు శుక్రవారం ఇల్లెందులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భారతి, మెరుగు రమణ, లక్ష్మి, సంధ్య, పద్మ, ఉమ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ స్కూల్‌లో టీచర్‌ను నియమించండి..


ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ఇల్లెందు: పట్టణంలోని ఏకైక ఉర్దూ స్కూల్‌లో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానికులు ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 25 ఏళ్లగా ఇక్కడి ఉర్దూ స్కూల్ నడుస్తోందని, అతియా అనే ఉర్దూ టీచర్ బదిలీపై వెళ్లిన తర్వాత కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారని రెగ్యులర్ ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఎస్‌కే అబ్దుల్ రహీం, అన్వర్ తదితరులున్నారు.

అరుణోదయ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న కొండలరావు

టేకులపల్లి: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ఈనెల 20న నర్సంపేటలో నిర్వహిస్తున్నారని కవులు, కళాకారులు, రచయితలు, కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సమాఖ్య కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కం కొండలరావు, మెంతిన కొండలరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి మండల కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ నర్సంపేటలో డప్పు కోలాటం, డోలి, గొంగడి తదితర కళాకారులతో భారీ ప్రదర్శన జరగనుందని తెలిపారు. ఈ సమావేశంలో బి.నర్సింగ్, వీరమల్ల, సురేష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

సుజాతనగర్: వైద్యం నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్ సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యసేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

డ్రైవర్లు, హెల్పర్లకు వేతనాలివ్వండి..


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాల్వంచ మున్సిపాలిటీలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ డ్రైవర్లు, హెల్పర్లకు మున్సిపాలిటీ ద్వారా వేతనాలు ఇవ్వాలని బీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ మాట్లాడుతూ.. అన్ని మున్సిపాలిటీలలో మున్సిపాలిటీల ద్వారా వేతనాలు చెల్లిస్తుంటే పాల్వంచ మున్సిపాలిటీలో మాత్రం ఇంటింటికి రూ.50 చొప్పున వసూలు చేసుకోమని చెబుతున్నారని, కొంతమంది మాత్రమే డబ్బులు ఇవ్వడం వలన కనీస అవసరాలు కూడా తీరక దుర్భర జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న పాల్వంచ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేయనున్నట్లు తెలిపారు. కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, కాకటి హుస్సేన్, రాయల పార్వతి, బత్తుల వెంకటేశ్వరమ్మ, దేవాళ్ల రమణ, రమణ పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ నిర్మాణం చేయాలి


మాట్లాడుతున్న నరేష్

జూలూరుపాడు: ప్రస్తుత తాత్కాలిక పత్తి ఉప మార్కెట్‌ను శాశ్వత మార్కెట్‌గా ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడు సీపీఎం కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాశ్వత మార్కెట్ లేకపోవడంతో తాత్కలిక సబ్ మార్కెట్‌లో పత్తి అమ్ముకోవడానికి వచ్చిన రైతులు దళారీల చేతుల్లో మోసపోతున్నట్లు చెప్పారు. అదేవిధంగా రైతులు మార్కెట్‌కు తెచ్చిన పత్తిని వ్యాపారులు అడిగిన రేటుకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసి ఆదుకోవాలన్నారు. బానోత్ ఇస్రా, గడిదేశి కనకరత్నం, గార్లపాటి వెంకటి, వల్లమల్ల చందర్‌రావు, జల్లి రాధాకృష్ణ, పద్దం సుగుణ, తాటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగును ప్రోత్సహిద్దాం..


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: గ్రామాలలో మునగ సాగును ప్రోత్సహించేందుకు రైతులను సిద్ధం చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నర్సరీలలో మొక్కల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలం ప్రారంభం నాటికి నిర్దేశించుకున్న వివిధ రకాల మొక్కలతోపాటు అంతే సంఖ్యలో మునగ మొక్కలను కూడా పెంచాలన్నారు. గ్రామాలలో పలు సందర్భాలలో నిర్వహించే గ్రామసభలు, సమావేశాలలో మునగ సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి సాగు దిశగా వారిని ప్రోత్సహించాలని సూచించారు. గతంలో పొలం గట్లపై టేకు మొక్కలు నాటిన సందర్భంలో ఇచ్చిన ప్రోత్సాహకాలను, మునగ సాగుకూ అందిస్తుందని చెప్పారు. మునగలో చీడపీడల నివారణకు నీమ్ ఔషధాన్ని రైతులు తక్కువ ధరలలో తయారు చేసుకునేలా వ్యవసాయశాఖ సహకరిస్తుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతీ రైతు కనీసం ఎకరం విస్తీర్ణంలో మునగ సాగు చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎకరం విస్తీర్ణం చుట్టూ బొంబో మొక్కలు నాటడం వల్ల కూడా మంచి ప్రయోజనాలు ఉంటాయన్నారు. వచ్చే వర్షాకాలంలో కొమరారం గ్రామపంచాయతీని మోడల్‌గా తీసుకొని కనీసం వెయ్యి ఎకరాలలో మునగ సాగు ప్రారంభించాలని లక్ష్యాన్ని ఉన్నతాధికారులు నిర్దేశించినట్లు వివరించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జూలూరుపాడు: రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా మాట్లాడుతూ... మార్కెట్‌లో దళారీలచే రైతులు మోసం పోతున్నారని, రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నట్లు చెప్పారు. మార్కెట్‌లో దళారీ వ్యవస్థను అరికట్టే విధంగా పాలకులు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్స్ ప్రకారం పంటల మద్దతు ధర కల్పించాలన్నారు. పత్తి క్వింటాల్ ఒక్కింటకి రూ.10,000, మొక్కజొన్నకు రూ.3,500 గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. జూలూరుపాడు సబ్ మార్కెట్‌ను ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి వీడదీసి శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలని, లేదంటే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వై.గోపాల్‌రావు, లింగాల వీరభద్రం, రాయల సిద్ధు, ఎం కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, వెంకటమ్మ, గోపమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సింగరేణి(కొత్తగూడెం): స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితానాయుడుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి పది నెలలు అవుతున్నా స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించలేదని, ఫలితంగా పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. కార్మికుల సొంతింటి పథకం అమలు చేయాలని, విజిలెన్స్ విచారణ పేరుతో డిపెండెంట్ ఉద్యోగాల పెండింగ్ సమస్యలు, భార్యభర్తలు ఉద్యోగులుగా ఉన్న వారికి డిపెండెంట్ ఉద్యోగం, ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.